ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కడప
జిల్లా వార్తలు

5

శనివారం 24 ఫిబ్రవరి 2024



యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- పాపాఘ్నిలో ఎక్కడపడితే అక్కడ ఏర్పడ్డ గుంతలు
- ఎండుతున్న మంచినీటి ఫిల్టర్లు
- అయినా పట్టించుకోని అధికారులు

వేంపల్లె, ఫిబ్రవరి 23: పాపాఘ్ని నదిలో ఇసుక యథేచ్ఛగా తరలిపోతోంది. రాత్రింబవళ్లు తేడా లేకుండా ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇసుక క్వారీ లేకున్నా నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడపడితే అక్కడ ఇసుకను తవ్వేస్తుండటంతో పాపాఘ్ని నదిలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అధికార పార్టీకి చెందిన వారే ఈ ఇసుక దోపిడీ చేస్తున్నారు. వారిని అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం చోద్యం చూస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తాగునీటి పథకాలున్నా..

వేంపల్లె మేజర్ పంచాయతీలో సుమారు 70వేల జనాభా ఉంది. తాగునీటి అవసరాలకు పాపాఘ్ని నుంచి ఫిల్టర్ల ద్వారా అందిస్తున్నారు. వేంపల్లె చుట్టు పక్కల 22 గ్రామాలకు పాపాఘ్ని నుంచే తాగునీటిని అందిస్తున్నారు. వేంపల్లెలో పాపాఘ్ని నది పొడవునా ఫిల్టర్లను ఏర్పాటు చేసి తాగునీటి అవసరాలకు సరఫరా చేస్తున్నారు. వర్షాభావంతో పట్టణంలోని చాలా ప్రాంతాలకు పాపాఘ్ని నుంచి తాగునీరు ఇప్పటికే అందడం లేదు. దీనికితోడు ఇసుక అక్రమార్కులు తాగునీటి పథకాలకు సమీపంలోనే పెద్దఎత్తున ఇసుకను తరలిస్తుండటంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఇష్టానుసారం ఇసుక తరలింపుతో భూగర్భజలాలు అడుగంటడంతో ఫిల్టర్లలో నీరు తగ్గి గతంలోనూ కొన్ని ఎండిపోయాయి. ప్రస్తుతం అదే పరిస్థితి కొనసాగుతోంది. నదికి రెండువైపుల పొలాలు సాగుచేశారు. రైతుల బోర్లలో కూడా భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన సంబంధిత అధికార యంత్రాంగం ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ఇసుక అక్రమార్కులు ఆడిందే ఆట పాడిందేపాటగా కొనసాగుతోంది.

అభివృద్ధి పేరుతో

వేంపల్లెలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ పనులకు ఇసుక అవసరమే కదా అనే వాదన ఉంది. అయితే ప్రభుత్వం ద్వారా నిర్దిష్ట ప్రదేశంలో క్వారీ మంజూరు చేయించుకుని ఇసుకతరలిస్తే ఎవరు అభ్యంతరం పెట్టాల్సిన అవసరం ఉండదు.



వేంపల్లె సమీపంలోని పాపాఘ్నిలో పట్టపగలే ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

వేంపల్లెకు క్వారీ లేకపోయినా ఇక్కడ ఇసుక యథేచ్ఛగా తరలిపోతోంది. వేంపల్లెలో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో సిమెంటు రోడ్లు, కాల్వ నిర్మాణం జరుగుతున్నాయి. భూగర్భ డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. అయితే కలెక్టర్ ద్వారా పర్మిషన్ తెచ్చుకున్నాం, పాపాఘ్నినదిలో ఇసుక తోలుకుంటున్నామని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. అనుమతులు ఉంటే నీటి పథకాలకు దూరంగా ఇసుకను తరలించుకునేలా చూడాల్సిన బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉంది. ఆ దిశగా ఎలాంటి చర్యలూ లేవు. భవిష్యత్తులో నీటి సమస్య ఉత్పన్నం కాకుండా నియంత్రణ జరగాల్సిన అవసరం ఉంది. అలాగే రాత్రింబవళ్లు ఇసుకను తరలిస్తున్నవారిని అధికార యంత్రాంగం అడ్డుకోవాల్సి ఉంది.


చర్యలు తీసుకుంటాం..

నేను కొత్తగా బాధ్యతలు చేపట్టాను. నదిలో ఇసుక అక్రమరవాణా జరుగుతుంటే చర్యలు తీసుకుంటాం. వీఆర్వోలను పంపించి తనఖీలు చేపడతాం. ఇసుక అక్రమ రవాణా చేస్తూ వాహనాలు పట్టుబడితే జరిమానా విధిస్తాం.

- వెంకటేశ్ నాయక్, తహశీల్దార్, వేంపల్లె



వేంపల్లె సమీపంలో యథేచ్ఛగా వాహనాల రాకపోకలతో ఏర్పడ్డ రహదారి



ఇసుక తరలిస్తుండడంతో భూగర్భజలాలు అడుగంటి పాపాఘ్నిలో ఎండిపోయిన మంచినీటి ఫిల్టర్



మాట్లాడుతున్న డీఆర్వో గంగాధర్ గౌడ్

రేపు గ్రూప్-2 పరీక్షలు

- ఉదయం 10-30 నుంచి 1-30 వరకు పరీక్ష నిర్వహణ
- 67 పరీక్ష కేంద్రాలు.. 23,806 మంది అభ్యర్థులు : డీఆర్వో

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 23: రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం నిర్వహించే గ్రూప్-2 పరీక్షలకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై రూట్ ఆఫీసర్లు, లైజాన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లతో జిల్లా రెవెన్యూ అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ 25వ తేదీ ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి 1-30 గంటల వరకు గ్రూప్-2 పరీక్షలు జరుగుతాయన్నారు. ఆబ్జెక్టివ్ పద్ధతిలో జరిగే ఈ పరీక్షలకు జిల్లాలో 67 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లావ్యాప్తంగా 23,806 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు అవుతున్నారన్నారు. పరీక్ష రోజు ఉదయం 9 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతిస్తామన్నారు. హాల్ టికెట్టుతో పాటు ఏదైనా గుర్తింపు కార్డుతో రావాలన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్లను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ ప్రమీల, సెక్షన్ ఆఫీసరు విజయ నిర్మల, రూట్ ఆఫీసర్లు, లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతను మోసగించిన జగన్

- చలో సెక్రటేరియట్‌ను అడ్డుకోవడం అప్రజాస్వామికం
- తులసిరెడ్డి

వేంపల్లె, ఫిబ్రవరి 23: జగన్ ప్రభుత్వం నిరుద్యోగ యువతను నమ్మించి మోసగించిందని, రాబోవు ఎన్నికల్లో యువత వైసీపీని ఓడిస్తుందని మాజీ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రత్యేక హోదా సాధించి ఉద్యోగాల విప్లవం తీసుకువస్తాం, ఖాళీగా ఉన్న 2.30లక్షల రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తాం, ప్రతి ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని వైసీపీ తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొందన్నారు. నిరుద్యోగ యువత నమ్మి ఓట్లేసి గెలిపించారన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదు కానీ సాక్షి క్యాలెండర్‌ను విడుదల చేశారన్నారు. మెగా డీఎస్సీ నిర్వహిస్తామని నాలుగేళ్లు మరచిపోయి ఎన్నికలు వస్తాయనగా 6100 పోస్టులతో దగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. వైసీపీ పారిశ్రామిక వ్యతిరేక విధానాల వల్ల ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు, ఉపాధి లభించడం లేదన్నారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ శాంతియుతంగా చలో సెక్రటేరియట్ కార్యక్రమానికి పిలుపునిస్తే కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డిని, కాంగ్రెస్ నాయకులను ఎక్కడికక్కడ పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికం, నిరంకుశత్వమన్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని యువత చిత్తుచిత్తుగా ఓడిస్తుందన్నారు.

కొత్త సర్వీసుల విడుదలలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

కడప (ఎర్ర ముక్కపల్లె), ఫిబ్రవరి 23: జిల్లాలో కొత్త సర్వీసుల విడుదలలో నిర్లక్ష్యం వహిస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా విద్యుత్‌శాఖాధికారి ఎస్.రమణ తెలిపారు. శుక్రవారం కడప విద్యుత్ వినియోగదారుల సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా ఆయన తనిఖీ చేసి పరిశీలించారు. కొత్త సర్వీసును ఇతర సేవల కోసం ప్రజలు నమోదు చేసుకున్న తరువాత సంస్థ నిర్దేశించిన కాలవ్యవధిలో విడుదల చేయాలని సూచించారు. వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలపై వచ్చినప్పుడు వారికి సంతృప్తికరమైన సమాధానం ఇచ్చి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. విడుదల చేసిన కొత్త సర్వీసులను పరిశీలించి స్వయంగా వినియోగదారులకు ఫోను చేసి సంస్థ అందించిన సేవల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీలో తృతీయ విజేతగా జిల్లా జట్టు

కడప (స్పోర్ట్స్), ఫిబ్రవరి 23: గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో 23 వరకు జరిగిన 33వ సబ్-జూనియర్స్ బాల, బాలికల అంతర్ జిల్లాల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలలో జిల్లా బాలుర జట్టు తృతీయ విజేతగా నిలిచిందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఓ.రవీంద్రరెడ్డి, ఆర్.వెంకటసుబ్బయ్య వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా జట్టులోని సంతోష్ (సి) బ్రహ్మయ్య, నూర్‌బాష, దశరథ్, బాలాజి, వంశీ, పవన్, నరేంద్ర, ఉమాశంకర్, ప్రణీత్‌కుమార్, అజయ్ కుమార్, మద్దిలేటిస్వామిని అభినందించారు. తృతీయ స్థానం కైవసం చేసుకోవడంలో కీలకపాత్ర పోషించిన కడప డీఎస్‌ఏ కబడ్డీ కోచ్ ఆర్వీ శ్రీధర్‌ను అలాగే జిల్లా జట్టు క్రీడాకారులను అభినందించారు.



తృతీయ విజేతగా నిలిచిన కడప జిల్లా కబడ్డీ జట్టు క్రీడాకారులు

ఫ్రై..డే

- ఫిబ్రవరిలోనే భానుడు భగభగలు
- వేసవి ఆరంభంలోనే సూర్యుడి ప్రతాపం
- రోజురోజుకూ ఎండ తీవ్రత పెరగడంతో జనాల అవస్థలు





కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 23: ఎండలు మండిపోతున్నాయి. ఫిబ్రవరి పూర్తికాకనే సూర్యుడు భగభగమంటున్నాడు. శివరాత్రికి శివశివా అంటే చలి తగ్గుతుందనేవాళ్లు.. శివరాత్రికి నెలముందు నుంచే చలికి కాదు.. ఎండకు అబ్బబ్బా అంటూ జనం అల్లాడిపోతున్నారు. శుక్రవారం సూర్యోదయం నుంచే సూర్యుడు ప్రతాపం చూపించాడు. దీంతో ఫ్రైడే కాస్త ఫ్రై..డేగా మారిపోయింది. ఉదయం 11 గంటలు దాటాక జనం ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడేలా ఎండలున్నాయి. ఎండలతో వేడి తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

ఎప్పుడో ఏప్రిల్, మే నెలలో రావాల్సిన ఎండలు ఫిబ్రవరిలోనే ప్రజలను ఠారెత్తిస్తున్నాయి. ఫిబ్రవరి ప్రారంభంలోనే 37 డిగ్రీల ఎండ నమోదవుతోంది. ఈ నెల పూర్తయ్యే లోపు 38 డిగ్రీలు దాటే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పుడే ఇలా ఉంటే ఇక మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండలు ఎలా ఉంటాయో అని జనం భయపడుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలలో ఎండలు 45 డిగ్రీలు దాటొచ్చని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఆందోళన చెందుతున్న ప్రజలు

చలి కాలంలోనే వాతావరణం వేసవిని తలపిస్తోంది. స్కూళ్లకు వెళ్లే పిల్లల మొదలుకుని వృద్ధులు, పాదచారులు, దినసరి కూలీలు, తోపుడుబండ్ల కూలీలు, రిక్షా కార్మికులు ఈ ఎండల వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఫుట్‌పాత్ మీద ఉండే భిక్షగాళ్లు, అనాధలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఎండను, ఎండ వేడిని ఎలాగు ఆపలేరు కాబట్టి ప్రభుత్వం చొరవ తీసుకుని విరివిగా చలివేంద్రాలు, అక్కడక్కడా షెల్టర్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. నగరంలో కొద్దిరోజులుగా విస్తరణ పనులు చేపడుతుండడం వల్ల ఉన్న కాస్త కూస్తో చెట్లు సైతం తొలగించేశారు. దీంతో వాహనదారులకు, పాదచారులకు కనీసం నిలవ నీడ కూడా లేకుండాపోయింది. ఈసారి వేసవికాలం సుదీర్ఘంగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ ముందే హెచ్చరించింది.

జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రమాదమే

వేసవి కాలంలో ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది కాబట్టి ప్రజలు స్వీయ రక్షణతోపాటు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని కడప రిమ్స్, సూపర్ స్పెషాలిటీ సూపరింటెండెంట్ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ప్రజలు చాలా వరకు ఎండ ఎక్కువగా ఉండే సమయంలో బయట తిరగరాదన్నారు. లేత రంగులు, తెల్లటి వస్త్రాలు ధరించాలని, నీళ్లను అధికంగా తీసుకోవాలని అన్నారు. వెంట నీళ్లబాటల్, గొడుగులను తీసుకెళ్లాని, మజ్జిగ, టెంకాయ నీళ్లు, పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. చెమట అధికంగా వచ్చి దమ్ము ఒంటిపై పేరుకుపోతుంది కాబట్టి వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరరమని తెలిపారు. మసాలా, ఆయిల్, జంక్‌ఫుడ్‌లకు వేసవిలో దూరంగా ఉండటం మేలన్నారు. వీలైన వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు ముగించుకునేలా చూసుకోవాలన్నారు. వాంతులు, విరేచనలు, డీహైడ్రేషన్ అయితే వెంటనే వైద్యున్ని సంప్రదించాలని, వైద్యుల సలహా మేరకు మందులు వాడాల్సి ఉంటుందని వివరించారు.





ఎన్నికల నిర్వహణకు సంసిద్ధం

- కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 23: త్వరలో జరగనున్న ఎన్నికల నిర్వహణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లను సంసిద్ధం చేస్తున్నామని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. శుక్రవారం రాజధాని అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా సాధారణ ఎన్నికల సన్నద్ధతకు సంబంధించిన అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్ మీనా, అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు, నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధర్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ ఎపిక్ కార్డ్స్ జనరేషన్, పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతులు, మ్యాన్‌పవర్, సెక్యూరిటీ ఏర్పాట్లు, చెక్‌పోస్టులు తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ విధివిధానాల మేరకు జిల్లాలో అన్ని కార్యక్రమాలు పూర్తిచేస్తున్నామన్నారు. నియోజకవర్గాల వారీగా ఎపిక్ కార్డులు జనరేట్ చేశామన్నారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం అయ్యారు. ఎన్నికలకు అన్ని ఏర్పాట్లతో సంసిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు తీసుకోవాల్సిన అన్ని చర్యలపై దిశా నిర్దేశం చేశారు ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటరమణ, ఎన్ఐసీ అధికారి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధల ఉల్లంఘనపై 9542800800కు ఫిర్యాదు చేయవచ్చు

ప్రజల ప్రాణ భద్రత కోసం చేపడుతున్న రోడ్డుభద్రతా చర్యలపై ఆంక్షలు కఠినతరం చేయాలని కలెక్టర్ విజయరామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్‌తో పాటు నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్, ఏఎస్పీ సుధాకర్, కమిటీ మెంబరు, డీటీసీ మీరా ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యధిక శాతం ప్రజలు రోడ్డు ప్రమాదాల కారణంగానే చనిపోతున్నారన్నారు. డివైడర్లను బ్రేకు చేసేవారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ఎవరైనా రోడ్డు భద్రతా నిబంధలను ఉల్లంఘిస్తే 9542800800 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ విజయ రామరాజు



పడకేసిన పల్లె రాబడి

- లక్ష్యం రూ.25.2 కోట్లు.. వసూళ్లు రూ.6.24 కోట్లు
- వెక్కిరిస్తున్న ఖాళీ ఖజానా
- తిష్టవేసిన సమస్యలు
- నత్తనడకన పల్లెప్రగతి

కడప (రూరల్) ఫిబ్రవరి 23: సీఎం వైఎస్ జగన్ సొంత జిల్లాలో పల్లెరాబడి పడకేసింది. అభివృద్ధికి మూలాధారమైన పన్నుల వసూళ్లలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండడంతో పల్లెసీమల ప్రగతి కుంటుపడుతోంది. సర్కారు నిధులు అంతంతమాత్రంగానే వచ్చే గ్రామ పంచాయతీలు పన్నులు సైతం వసూళ్లు కాకపోవడంతో అభివృద్ధికి నోచుకోక ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మరో 37 రోజుల్లో ముగుస్తున్నప్పటికీ పన్నుల వసూళ్లపై పెద్దగా దృష్టి సారించకపోవడంతో లక్ష్యం నీరుగారుతోంది. దీంతో పంచాయతీల ఖజానా ఖాళీగా వెక్కిరిస్తోంది.

లక్ష్యం రూ.25.2 కోట్లు.. వసూళ్లు రూ.6.24 కోట్లు

జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.25.2 కోట్ల మేర పన్నులు వసూలు చేయాలని నిర్దేశించారు. ఇందులో పన్నుల ద్వారా రూ.17.63 కోట్లు, పన్నేతరాల ద్వారా రూ.7.39 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఇందులో ఈ నెల 22వ తేదీ నాటికి 65 శాతం అలాగే మార్చి చివరి నాటికి 100 శాతం సాధించాల్సి ఉంది. కానీ ఇప్పటివ రకు కేవలం 25 శాతం అంటే రూ.6.24 కోట్లు మాత్రమే వసూలు చేసింది. ఇక 37 రోజుల్లో రూ.19 కోట్లు రాబట్టాల్సి ఉంది.

డివిజన్ల వారీగా చూస్తే

కడప డివిజన్‌లో పన్నుల ద్వారా రూ.3.34 కోట్ల వసూలుకు గాను ఇప్పటివరకు కేవలం రూ.78 లక్షలు, అలాగే పన్నేతరాల ద్వారా రూ.97.98 లక్షలకు గాను రూ.35 లక్షలు మాత్రమే వసూలు చేశారు. ఇకపోతే బద్వేల్ డివిజన్‌లో పన్నుల ద్వారా రూ.2.50 కోట్లకు గాను రూ.82 లక్షలు, పన్నేతరాల ద్వారా రూ.16.52లక్షలకు గాను రూ.13.52 లక్షలు వసూలు చేశారు. జమ్మలమడుగు డివిజన్‌లో పన్నుల ద్వారా రూ.9.88 కోట్లకు గాను రూ.1.69 కోట్లు, పన్నేతరాల ద్వారా రూ.5.13 కోట్లకు గాను రూ.1.35 కోట్లు వసూలు చేశారు. అలాగే పులివెందుల డివిజన్‌లో పన్నుల ద్వారా రూ.1.85 కోట్లకు గాను రూ.69 లక్షలు, పన్నేతరాల ద్వారా రూ.1.11 కోట్లకు గాను రూ.43 లక్షలు మాత్రమే వసూలు చేశారు.

అడుగడుగునా అలసత్వం

జిల్లాలో మొత్తం 35 మండలాలున్నాయి. వీటిలో కడప మండలం పూర్తిగా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విలీనం కావడంతో పంచాయతీశాఖ పరిధిలో 34 మండలాలు మాత్రమే ఉన్నాయి. ఈ 34 మండలాల పరిధిలో 557 పంచాయతీలు ఉండగా.. వీటిలో 7 మేజర్ గ్రామ పంచాయతీలున్నాయి. వీటి అభివృద్ధికి మూలమైన ఆర్థిక వనరులను పన్నుల ద్వారా సేకరించడంలో అధికారులు అడుగడుగునా అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. మేజర్ పంచాయతీలకు వాటి పరిధిలోని వ్యాపార సముదాయాలు, సెల్‌టవర్ల అద్దెలు, ఇతరత్రా వాటి ద్వారా కాస్తోకూస్తో ఆదాయం వస్తోంది. సాధారణ పంచాయతీలలో ఇంటిపన్నులు, కొళాయి పన్నులే దిక్కుగా ఉంటున్నాయి. ఈ పన్నులు సకాలంలో వసూలు చేసి తగిన ఆర్థిక వనరులను సమకూర్చడంలో అధికారులు శ్రద్ధచూపకపోవడం వలన పంచాయతీల అభివృద్ధి మాట దేవుడెరుగు కానీ కనీసం బోరుబావులు కూడా మరమ్మతులు చేసుకోలేని దుస్థితి దాపురించింది.

ఎక్కడివేసిన గొంగడి అక్కడే

పన్నుల వసూళ్లలో జిల్లా పంచాయతీశాఖ నిర్లక్ష్యాన్ని వీడడంలేదు. జిల్లాలోని మొత్తం పంచాయతీలకు దాదాపు రెగ్యులర్ కార్యదర్శులు పనిచేస్తు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నా జిల్లా అధికారులు మాత్రం వారితో లక్ష్యాలను సాధించుకోలేక పోతున్నారు. దీంతో పన్ను వసూళ్ల ప్రకియ మాత్రం నత్తనడకన సాగుతోంది. పన్నులు సక్రమంగా వసూలు కాకపోవడంతో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయి. బోరుబావుల మరమ్మతులు, రోడ్లు, పారిశుధ్య పనులు, చివరికి వీధి దీపాలను కూడా ఏర్పాటు చేసుకోలేని దుస్థితి నెలకొంది.

పేరుకు పోతున్న బకాయిలు

జిల్లాలోని ఆయా గ్రామ పంచాయతీల్లో పన్ను బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోతున్నాయి. పంచాయతీల పరిధిలో పలుకుబడి కలిగిన వారి విద్యాసంస్థలు, వ్యాపారసంస్థలు, ఇతరత్రా వాటి ద్వారా పంచాయతీలకు రావాల్సిన పన్నులు కోట్ల రూపాయలల్లో మూలుగుతున్నాయి. కడప, ప్రొద్దుటూరు ఇతర ప్రధాన పట్టణాల సమీప గ్రామాల్లోని పలు ప్రైవేట్ పాఠశాలు, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు లక్షల రూపాయలను పన్నుల రూపంలో చెల్లించాల్సి ఉండగా ఇంతవరకు ఒక్కరూపాయి కూడా చెల్లించనట్లు సమాచారం.

లక్ష్యాన్ని సాధిస్తాం : డీపీవో

2023 - 24 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన పన్నులు వసూలు లక్ష్యాన్ని సాధిస్తామని డీపీవో ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో బకాయి పడిన పన్నులను రాబట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు పన్నులను వసూలు చేయాలని జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించామని తెలిపారు.



నాడు - నేడు పనులు పూర్తయ్యేదెప్పుడో!

- అసంపూర్తిగా పాఠశాలల భవన నిర్మాణ పనులు
- బిల్లులు మంజూరు కాక పనులు నిలిపివేత
- చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు... పట్టించుకోని అధికారులు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 23: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మారుస్తాం.. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా విద్యార్థులకు విద్యనందిస్తాం.. అంటూ పాలకులు గొప్పలు చెప్పి.. నాడు-నేడు కింద కొన్ని పాఠశాలల్లో తరగతి గదులు నిర్మాణాలు చేపట్టారు. ఆచరణలో మాత్రం ఆమేర పురోగతి కనిపించడంలేదు. విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉన్నచోట్ల అదనపు గదుల నిర్మాణానికి మౌళిక వసతుల కోసం నిధులు మంజూరు చేసినా నిర్మాణాలకు సంబంధించి 30 శాతం కూడా బిల్లులు రాకపోవడంతో అసంపూర్తిగానే మిగిలిపోయాయి.

పోరుమామిళ్ల మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో 2022 జూన్‌లో నాడు నేడు కింద అదనపు గదులు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఇయితే ఇప్పటి వరకు నిధుల లేమితో ఇప్పటి వరకు పూర్తి కాలేదు. నాడు-నేడు కింద అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు, టాయిలెట్లు, తాగునీటి పథకాలు తదితర అభివృద్ధి పనులకు సంబంధించి మొదటి, రెండో విడత కింద రూ.12కోట్ల మంజూరు కావడంతో కాంట్రాక్టర్లు పనులు మొదలు పెట్టారు. అయితే ఇప్పటి వరకు రూ.3.60 కోట్లు మాత్రమే బిల్లులు మంజూరయ్యాయి. దీంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు. అప్పులు తెచ్చి ఎక్కడ పెట్టుబడి పెట్టాలి.. బిల్లులు అందిన తరువాతనే పనులు చేస్తాం అని చెబుతున్నారు. మండలంలో 38 స్కూళ్లలో 22 అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు, మౌలిక వసతులకు సంబంధించి పనులు చేపట్టారు. అయితే టాయిలెట్లు, తాగునీటి పథకాలు, వైరింగ్ లాంటి పనులకు మాత్రం బిల్లులు అందినట్లు తెలిసింది. భవన నిర్మాణాలకు బిల్లులు అందకపోవడంతో అ సంపూర్తిగా ఉండిపోయాయి. పోరుమామిళ్ల జిల్లా పరిషత్ హైస్కూలులో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు చేపట్టగా.. శ్లాబు మాత్రమే వేశారు. మిగిలిన పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అలాగే వెంకటాపురంలో రెండు అదనపు తరగతి గదులకు శ్లాబు లెవల్ వరకు నిర్మాణాలు జరిగాయి. కవలకుంట్లలో అదనపు తరగతి గదులకు సైడ్ వాల్ మాత్రమే పూర్తి చేశారు. టేకూరుపేటలో 10 అదనపు తరగతి గదులు మంజూరైతే ఐదు గదులకు నిధులు మంజూరు చేశారు. ఇక్కడ సాంకేతిక సమస్య తలెత్తడంతో ఐదు అదనపు తరగతి గదులకు బేస్‌మట్టాల మేరకే వేశారు. మరో కోటి రూపాయల మేర నిర్మాణ పనులు జరగాల్సి ఉంది. గానుగపెంటలో కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణాలకు నిదులు మంజూరు కాగా.. ప్రస్తుతం లెంటిల్ లెవల్ వరకు పనులు చేశారు. దాదాపు రెండేళ్లు కావస్తున్నా ఈ అదనపు తరగతి గదులకు బిల్లులు రాకపోవడంతో అసంపూర్తిగానే పనులు వదిలేశారు. మళ్లీ మన ప్రభుత్వమే వస్తుంది కదా.. బిల్లులు రాకపోతాయా అనే ధోరణిలో కాంట్రాక్టర్లు ఉన్నారు. అయితే స్కూలు కమిటీ హెడ్మాస్టర్ల ఆధ్వర్యంలో నిర్మాణాలు పూర్తి కావాల్సి ఉంది. కానీ పేరుకు మాత్రమే వారి ఆధ్వర్యంలో నిర్మాణాలు జరుగుతున్నా పెత్తనం మాత్రం అధికార పార్టీ నాయకుల చేతల్లోనే ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు, విద్యాశాఖాధికారులు చొరవ తీసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు విడుదల చేయిస్తే వచ్చే విద్యాసంవత్సరానికైనా అదనపు తరగతి గదులు పూర్త య్యే అవకాశాలున్నాయి. ఈ విషయమై ఆర్ డబ్ల్యుఎస్ ఏఈ ఓబయ్య ను వివరణ కోరగా.. నిధులు విడుదలైతే మిగిలిన పనులు పూర్తి చేస్తామని తెలిపారు.



కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో అసంపూర్తిగా ఆగిపోయిన పనులు



టేకూరుపేట జిల్లా పరిషత్ హైస్కూలులో బేస్‌మట్టానికి పరిమితమైన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు

వైఎస్ఆర్ ఏఎఫ్ఏయూ సెమిస్టరు పరీక్ష ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వైస్‌చాన్సలర్, రిజిస్ట్రార్

కడప (ఎర్ర ముక్కపల్లె), ఫిబ్రవరి 23: కడప నగరం డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీలో ఆర్కిటెక్చర్‌కు సంబంధించి 3, 5, 7వ సెమిస్టరు, కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌కు సంబంధించిన 1, 5 సెమిస్టరు పరీక్ష ఫలితాలను వైస్‌ఛాన్సలర్ ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రారు ప్రొఫెసరు వీసీ సురేంద్రనాధరెడ్డి విడుదల చేశారు. శుక్రవారం యూనివర్శిటీలో పరీక్షల విభాగంతో కలిసి ఫలితాలను వారు విడుదల చేశారు. అనంతరం వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ ఆర్కిటెక్చర్ మూడో సెమిస్టరు ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. అలాగే ఐదో సెమిస్టరులో 83 శాతం, 7వ సెమిస్టరులో 84 శాతం ఉత్తీర్ణత నమోదు చేసుకున్నారని తెలిపారు. కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌కు సంబంధించి మొదటి సెమిస్టరు పరీక్షలో 83 శాతం, ఐదో సెమిస్టరులో 89 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత పొందినట్లు తెలిపారు. పరీక్ష ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో పొందపరిచామన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వై.పవన్‌కుమార్‌రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సుప్రియ, పరీక్షల నియంత్రణ సహాయ అధికారి ఉదయ్ ప్రకాశ్‌రెడ్డి, లక్ష్మి ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాస్వామ్యానికి పాతరేస్తున్న ఈవీఎంలు'

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 23: రెండు పర్యాయాలు ఈవీఎంల పుణ్యమా అని బీజేపీ అధికారంలోకి వచ్చిందని, ప్రజాస్వామ్యానికి పాతరేస్తున్న ఈవీఎంలను వచ్చే ఎన్నికల్లో ఉపయోగించరాదని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది భానుప్రతాప్ సింగ్ డిమాండ్ చేశారు. ఆ మేరకు సౌత్ ఇండియన్ ముసాయిద్ యాక్షన్ కమిటీ బోర్డు ఆధ్వర్యంలో శుక్రవారం కడపలో ఈవీఎం హటావో-దేశ్‌కీ బచావో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. వేరే ఏ ఇతర పార్టీకి అనుకూలంగా ఓటు వేసినా బీజేపీకే ఆ ఓటు చేరేలా ఈవీఎంలలో ముందస్తుగా నిక్షిప్తం చేశారనే అనుమానాలను చాలామంది వ్యక్తం చేశారన్నారు. కావున ఈవీఎంల ద్వారా కాకుండా బ్యాలెట్‌పేపర్ ద్వారా రానున్న సార్వత్రిక ఎన్నికలను నిర్వహించేలా కేంద్ర ఎన్నికల సంఘం స్పందించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ బోర్డు కన్వీనర్ ఎస్.జహీరుద్దీన్ హుస్సేన్, కో కన్వీనర్ సయ్యద్ సలావుద్దీన్, నాయకులు అమీర్‌బాబు, నజీర్‌అహ్మద్, అలీఖాన్, కె.సీ.బాదుల్లా, ఫాదర్లు మోహన్‌బాబు, విల్సన్, సిరాజ్‌బుఖారి తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి



పోలీసు అధికారులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ సుధాకర్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 23: రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో పోలీసు అధికారులతో పాటు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని డీఎస్పీ సుధాకర్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ అన్నమయ్య జిల్లాలో ఉన్న సీఐలు, ఎస్ఐలతో రానున్న సార్వత్రిక ఎన్నికలపై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏ పోలింగ్ కేంద్రంలో ఎంత మంది ఓటర్లు ఉన్నారు అనే విషయాలను ఆరా తీసి భద్రత పరమైన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకోవాలని సూచించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు. ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు సమర్థంగా ఎదుర్కోవడానికి ప్రతి ఒక్క పోలీసు అప్రమత్తంగా ఉండాలన్నారు.

29 లోపు దుకాణాల ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

కడప (చిన్నచౌకు), ఫిబ్రవరి 23: జిల్లాలో కొత్తగా దుకాణాల ఏర్పాటు చేసేవారు దుకాణాల సంస్థల చట్టం-1988 ప్రకారం తప్పనిసరిగా అనుమతి కోసం కార్మికశాఖ కార్యాలయంలో నమోదు చేసుకుని రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందాలని కార్మికశాఖ ఉప కమిషనర్ బి.శ్రీకాంత్‌నాయక్ శుక్రవారం ప్రకటనలో కోరారు. దుకాణాల సంస్థలు ఏర్పాటు చేసుకునేవారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందాలని సూచించారు. గడువు తక్కువగా ఉండడంతో ప్రతి ఒక్కరూ ఈనెల 29లోపు నమోదు చేసుకువాలని ఆయన కోరారు.

రాష్ట్రస్థాయి ఉపన్యాస పోటీల్లో తృతీయ విజేతలుగా సానియా, వెన్నెల



బహుమతులు అందుకుంటున్న విద్యార్థినులు

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 23: భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ, నెహ్రూ యువకేంద్ర సంగతాన్ ఏపీ వారు నిర్వహించిన మై భారత్ వికసిత్ భారత్ 2047 అనే అంశంపై శుక్రవారం గుంటూరులో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించినట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి మణికంఠ వెల్లడించారు. పోటీలలో జిల్లాకు చెందిన ఎస్‌కేఆర్ కళాశాల విద్యార్థిని సయ్యద్ సానియా, ట్రిపుల్ ఐటీ విద్యార్థిని వెన్నెల సంయుక్త తృతీయ విజేతలుగా గెలుపొందడం హర్షణీయమన్నారు. విజేతలకు రూ.25వేలు నగదు బహుమతి అందించారన్నారు. ఇలాంటి పోటీలలో యువత మరింతగా పాల్గొని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

రేపు జిల్లా స్థాయి పురుషుల కబడ్డీ క్రీడాకారుల ఎంపికలు

కడప (స్పోర్ట్స్), ఫిబ్రవరి 23: ఉమ్మడి వైయస్ఆర్ కడప జిల్లా స్థాయి సీనియర్స్ పురుషుల కబడ్డీ క్రీడాకారుల ఎంపికలు ఈనెల 25వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు నగర డీఎస్ఏ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ జనర్ సెక్రటరీ ఆర్.వెంకటసుబ్బయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.అరుణ తెలిపారు. 85 సంవత్సరాలలోపు ఔత్సాహిక క్రీడాకారులు తప్పక ఎంపికలకు హాజరు కావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే మార్చి 3, 4, 5, తేదీలలో వైజాగ్‌లో నిర్వహించే అంతర్ జిల్లాల పురుషుల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొనాల్సి వుంటుందన్నారు. ఇతర వివరాలకు 6304809294, 9392951505 అనే నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

కుక్కల దాడిలో 25 గొర్రెలు మృతి



కుక్కల దాడిలో చనిపోయిన గొర్రెలు

రామాపురం, ఫిబ్రవరి 23: మండలంలోని కల్పనాయునిచెరువు పంచాయతీ మూగిరెడ్డిగారిపల్లెలో శుక్రవారం ఉదయం గొర్రెల మందపై కుక్కలు దాడి చేసి 25 గొర్రెలను చంపేశాయి. బాధితుల వివరాల మేరకు.. మూగిరెడ్డిగారిపల్లెకు చెందిన తాతిరెడ్డి గంగిరెడి ఊరు బయట కంచె ఏర్పాటు చేసి గొర్రెల మందను తోలేవాడు. శుక్రవారం తెల్లవారుజామున కుక్కలు మందపై కుక్కలు దాడి చేసి 25 గొర్రెలను చంపేశాయి. ఉదయం గంగిరెడ్డి ఆయన భార్య నాగరత్నమ్మ మృతి చెందిన గొర్రెలను చూసి బోరున విలపించారు. పంటలు పండకపోవడంతో అప్పు చేసి గొర్రెలను పెంచుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నామని.. గొర్రెల మృతితో తాము రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. చనిపోయి గొర్రెల విలువ దాదాపు మూడు లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరారు. సమాచారం అందుకున్న పశుసంవర్థకశాఖ అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి గ్రామానికి చేరు కుని పోస్టుమార్టం నిర్వహించారు. గొర్రెలకు బీమా లేకపోవడంతో, ప్రభుత్వం నుంచి సాయం అందే అవకాశం లేదని తెలిపాడు.

పెన్నానదిలో వ్యక్తి గల్లంతు

వల్లూరు, ఫిబ్రవరి 23: మండల పరిధిలోని పుష్పగిరి వద్ద పెన్నానదిలో చెన్నయ్య అనే వ్యక్తి గల్లంతయినట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... సీకేదిన్నె మండలం పోలుగారిపల్లె గ్రామానికి చెందిన చెన్నయ్య బేల్దారి పనిచేస్తూ జీవనం సాగించేవాడు. తన తోటి పనివారితో కలిసి 9 మంది పుష్పగిరికి వచ్చారు. పెన్నానదిలో స్నానం చేస్తుండగా చెన్నయ్య కనిపించకుండా పోయాడు. తోటి కూలీల అతని కుటుంబ సభ్యులకు తెలిపారు. చెన్నయ్య భార్య గంగమ్మ అక్కడకు చేరుకుని తన భర్త కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది హుటాహుటిన ఎస్ఐ వెంకటరమణ తన సిబ్బందితో అక్కడకి వెళ్లి విచారించారు. అప్పటికే చీకటి పడడంతో శనివారం పూర్తిస్థాయిలో అతని ఆచూకీ కోసం వెతికిస్తామని తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ... ఆర్మీ జవాను మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



సంఘటనా స్థలంలో క్షతగాత్రులు, ప్రమాదంలో మృతి చెందిన ఆర్మీ జవాన్ మనోజ్ (ఫైల్)

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 23: మండలంలోని రామిరెడ్డికుంట సమీపంలో గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో మనోజ్ అనే ఆర్మీ జవాను అక్కడికక్కడే మృతి చెందగా, తిరుపతి, అంజి అనే ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ మల్లిఖార్జునరెడ్డి కథనం మేరకు.. ప్రకాశం జిల్లా బెస్తవారిపేట మండలం గంజరపల్లెకు చెందిన వీరు శుక్రవారం సంతకు వచ్చి కొమరోలు వైపు తిరిగి వెలుతుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుడు మనోజ్ 8 ఏళ్ల క్రితం నుంచి ఆర్మీలో ఉన్నాడని, రెండేళ్ల క్రితం వివాహం జరిగిందని, ఒక కుమారుడు సంతానమని తెలిసింది. విషయం తెలిసిన ఎస్ఐ సంఘటనాస్థలానికి వెళ్లి విచారణ చేశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అంజిని మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న మనోజ్ కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని బోరున విలపించారు.

వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న షకీలా

చిన్నమండెం, ఫిబ్రవరి 23: ఆస్తిని కాజేసేందుకు వేధిస్తున్నారనే కారణంతో షకీలా అనే మహిళ శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపారు. స్థానికుల వివరాల ప్రకారం... చాకిబండ పంచాయతీకి చెందిన షకీలా ఇద్దరు పిల్లలు మాండవ్యనది వరదల్లో కొట్టుకుపోవడంతో ప్రభుత్వం రెండేళ్ల క్రితం ఆర్థిక సాయం అందించింది. ఆ సొమ్ముతో షకీలా కొంత ఆస్తిని కొంది. ఈ ఆస్తిని కాజేసేందుకు తన భర్త పెద్ద భార్య కొడుకు రౌడీ మూకలతో కలిసి తనను వేధిస్తున్నాడంటూ పలుమార్లు పోలీ సులకు ఫిర్యాదు చేసింది. అయినా, ఎటువంటి ఫలితం లేకపోవడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ విషయం గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు. దీనిపై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన నాగశివకుమార్

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 23: కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బ్రహ్మంగారిమఠం మండలంలోని ప్రభునగర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ విద్యాసాగర్ వివరాల మేరకు.. వెల్లాల నాగశివకుమార్(54) బ్రహ్మంగారి మఠం దేవస్థానంలో డ్రైవరుగా విధులు నిర్వహించేవారు. గురువారం అర్ధరాత్రి ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతునికి ఇద్దరు భార్యలు కాగా.. మొదటి భార్యకు ముగ్గురు సంతానం, మరో భార్యకు ఒకరు సంతానం. కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో ఆరోగ్యం సరిగా లేక మృతుడు ఉరి వేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని తల్లి సరోజనమ్మ ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గండికోట ప్రాజెక్టులో భారీగా తగ్గిన నీటిమట్టం

కొండాపురం, ఫిబ్రవరి 23: గండికోట ప్రాజెక్టులో నీటిమట్టం భారీగా తగ్గింది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీయంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 5.71 టీయంసీల నీరు మాత్రమే నిల్వ ఉన్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. కాగా ప్రాజెక్టు నుంచి ప్రస్తుతం మిగిలిన రిజర్వాయిర్లకు నీటిని వదలడం లేదు. వచ్చేది ఎండకాలం కావడంతో ఈ నీటిమట్టం మరింత తగ్గే అవకాశం ఉంది.

నిరంతరాయంగా ఏడు గంటల విద్యుత్ ఇవ్వాలి



ఇన్‌చార్జి ఏఈతో చర్చిస్తున్న రైతులు

ఖాజీపేట, ఫిబ్రవరి 23: పంటలు ఎండిపోతున్నాయని.. నిరంతరాయంగా ఏడు గంటలు కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్న కొందరు రైతులు శుక్రవారం ఖాజీపేట సబ్‌స్టేషన్‌కు చేరుకుని ఇన్‌చార్జి ఏఈ గోవర్ధన్‌రెడ్డి ఎదుట తమ ఆవేదన వెలిబుచ్చారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇష్టానుసారంగా విద్యుత్తు సరఫరా చేస్తుండటంతో పంట లు ఎండుపోతున్నాయని వాపోయారు. నిరంతరాయంగా ఏడు గంటలు ఇవ్వకపోయినా కనీసం ఆరు గంటలైనా ఇవ్వాలన్నారు. రోజు మూడు దఫాలుగా విద్యుత్తు సరఫరా ఇస్తున్నారని, రాత్రివేళల్లో ఇబ్బంది పడుతున్నామని తెలి పారు. దీనిపై ఏఈని వివరణ కోరగా రైతులు ఎవరు వచ్చినా సమాధానం చెబుతానని.. ఎక్కువ ఫోన్లు రావడంతో కొందరికి చెప్పలేకపోయానని, అంతమాత్రాన రైతులకు సమాధానం ఇవ్వనట్లు కాదని తెలిపారు.

ప్రతిభ కనబరిచిన పోలీసులకు వీక్లీ బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ అవార్డులు



అత్యుత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రం, నగదు రివార్డులు అందించిన ఎస్పీ సిద్దార్థ కౌశల్

కడప (క్రైం), ఫిబ్రవరి 23 : విధి నిర్వహణలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన పోలీసు సిబ్బందిని ప్రోత్సహించే క్రమంలో జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ వీక్లీ బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డులు అందిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ముగ్గురు సివిల్, స్పెషల్‌బ్రాంచ్, ఎస్ఈబీ నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేసి నగదు రివార్డు, ప్రశంసాపత్రం అందించి అభినందించారు. జిల్లా స్పెషల్ బ్రాంచ్ కార్యాలయంలో కీలక విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ కె.ప్రతాప్‌ను, బద్వేలు పోలీసుస్టేషన్ పరిధిలోని పీపీ కుంట చెక్‌పోస్టు వద్ద అక్రమంగా తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకోవడంలో కృషి చేసిన కానిస్టేబుల్ ఎల్.అమరేశ్వర్‌రెడ్డిని, మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకోవడంలో కృషి చేసిన ఎన్‌ఫోర్స్‌మెంటు కానిస్టేబుల్ కె.విశ్వనాధరెడ్డిలను అభినందించి ప్రశంసాపత్రం, నగ దు రివార్డు అందించారు. అలాగే ముద్దనూరు పోలీసుస్టేషన్ పరిధిలో ఓ హత్యకేసులో నిందితులకు శిక్ష పడేలా చేసిన కానిస్టేబుల్ కె.రమేష్‌కుమార్, ప్రొద్దుటూరు త్రీ టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో లక్షల విలువైన ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడంలో కృషి చేసిన కానిస్టేబుల్ ఎం.తిరుమలయ్యలను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రం, నగదు రివార్డులు అందించారు.

చిరుత పులి సంచారం.. భయం గుప్పిట్లో ప్రజలు

చక్రాయపేట, ఫిబ్రవరి 23: మండలంలోని సురభి, చిలేకాంపల్లె, నెరుసుపల్లె గ్రామాల పరిసరాలలో చిరుతపులి సంచరిస్తున్నట్లు పశుకాపరులు చెబుతున్నారు. ఆయా గ్రామాల పొలాల పరిసర ప్రాంతాలలో చిరుతపులి సంచరిస్తుండగా కొందరు ఫోటోలు తీసినట్లు పశుకాపరులు చెబుతున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు భయంగుప్పిట్లో ఉన్నారు. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

తప్పిన పెను ప్రమాదం

కడప (క్రైం), ఫిబ్రవరి 23: కడప నగరంలోని ముత్తరాసుపల్లెలో ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్‌స్తంభాలు ఒక్కసారిగా కూలిపోయాయి. కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం అర్ధరాత్రి సమయంలో పనులు చేపడుతుండగా ఎక్స్‌కవేటర్ డ్రైవరు నిర్లక్ష్యంతో ప్రమాదం సంభవించి.. విద్యుత్ స్తంభాలు ఒక్కసారిగా ఇళ్లపైకి కూలిపోవడంతో స్థానిక ప్రజలు భయాందోళన చెందారు. స్థానికంగా ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ సరఫరా ఉండి ఉంటే.. ఊహించడానికే వణుకు పుడుతుంది. స్థానిక ప్రజల సమాచారంతో విద్యుత్ అధికారులు, చిన్నచౌకు పోలీసులు హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకున్నారు. పరిస్థితి చక్కబరిచేందుకు అధికారులు తమ వంతు కృషి చేశారు. ప్రమాదం తప్పడంతో ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



ఇళ్లపై కూలిపోయిన విద్యుత్ స్తంభాలు

కడప టూటౌన్ సీఐ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపట్టిన ఇబ్రహీం

కడప (క్రైం), ఫిబ్రవరి 23 : కడప టూటౌన్ అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్ సీఐగా జి.ఇబ్రహీం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా బనగానపల్లెకు చెందిన ఇబ్రహీం 2009 బ్యాచ్‌లో ఎస్‌ఐగా ఉద్యోగంలో చేరారు. జిల్లాలోని ప్రొద్దుటూరు టూటౌన్ ఎస్‌ఐగా విధుల్లో చేరారు. ఆ యన పలు పోలీసుస్టేషన్లలో ఎస్‌ఐగా పనిచేశారు. 2021లో సీఐగా పదోన్నతి పొందిన ఇబ్రహీం కర్నూలు సీఐడిలో ఏడాది పాటు పనిచేశారు. తరువాత ప్రొద్దుటూరు టూటౌన్ సీఐగా పనిచేస్తుండగా క డప టూటౌన్ సీఐగా బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో తమ వంతుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

క్రీడల ద్వారా మానసిక ప్రశాంతత


కేఎస్‌ఆర్ఎం కళాశాలలో ఇండోర్‌స్టేడియాన్ని ప్రారంభిస్తున్న కరస్పాండెంట్ రాజేశ్వరమ్మ, ఎండీ చంద్ర ఓబుళరెడ్డి (నాని) తదితరులు

సీకేదిన్నె, ఫిబ్రవరి 23: క్రీడల ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని కేఎస్ ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్, కోశాధికారి కందుల రాజేశ్వరమ్మ తెలిపారు. స్థానిక కేఎస్‌ఆర్ఎం స్పోర్ట్స్ అరేనాను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండున్నర ఎకరాల్లో రూ.8 కోట్లు వ్యయం చేసి విద్యార్థుల ఆరోగ్యం, మానసిక ప్రశాంతతను దృష్టిలో ఉంచుకుని ఇండోర్ స్టేడియాన్ని దేశంలోనే ఎత్తుపరంగా రెండవ ఇండోర్ స్టేడియాన్ని నిర్మించామన్నారు. ఇందులో ఆధునిక వసతులతో కూడిన జిమ్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, షిస్టోబాల్ వంటి క్రీడలను రెండు వేల మంది ప్రేక్షకులు వీక్షించే గ్యాలరీతోపాటు వంద మంది వీఐపీ లాంజ్ కూడిన సెంటరల్ ఏసీతో నిర్మించినట్లు పేర్కొన్నారు.
కళాశాల ఎండీ డాక్టర్ కందుల చంద్ర ఓబుళరెడ్డి మాట్లాడుతూ ఇండోర్ స్టేడియం నిర్మించాలనే తన తండ్రి, విద్యాసంస్థల అధిపతి, కీ.శే. కందుల శివానంద రెడ్డి కల నెరవేర్చడంతో పాటు ఎంతో మందికి శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కందుల రాజమోహన్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ మదనమోహన్‌రెడ్డి, కేఓఆర్ఎం కళాశాల ఛైర్మన్ శనివారపు వెంకటశివారెడ్డి, ప్రముఖ బహుళజాతీయ సంస్థ ఈఎన్‌డీ సీఈఓ శివారెడ్డి, ఐసీఐ స్టూడెంట్ చాప్టర్ సీఈవో జగదీష్, ఏపీ పరిశ్రమలశాఖ సలహాదారులు రాజోలి వీరారెడ్డి, ప్రిన్సిపల్ వీఎస్ఎస్ మూర్తి, కేఎల్ఎం ప్రిన్సిపాల్ ఎంవీ రత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మీ భవిష్యత్తుకు టీడీపీ గ్యారంటీ: పుత్తా


టీడీపీలో చేరిన వారితో కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి

వల్లూరు, ఫిబ్రవరి 23 : ఆంధ్ర రాష్ట్ర భవిష్యత్తు ఈనాడు చిన్నాభిన్నంగా ఉందని, ప్రజల భవిష్యత్తుకు టీడీపీనే గ్యారంటీనని టీడీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం మీ భవిష్యత్తుకు టీడీపీ గ్యారంటీ కార్యక్రమాన్ని కోట్లూరు గ్రామంలో చేపట్టారు. ఈ సందర్భంగా పుత్తా మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా టీడీపీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు సాధ్యమన్నారు. అనంతరం కోట్లూరు ఎస్సీ కాలనీలో 130 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి పుత్తా కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వీరి వెంట టీడీపీ మండలాధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డితోపాటు స్థానిక కోట్లూరు టీడీపీ నాయకులు క్రిస్టారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, లక్ష్మీరెడ్డి, హరిక్రిష్ణ, సుబ్బారెడ్డి, ఓబులేసుయాదవ్, నాగసుబ్బారెడ్డి, భాస్కర్, ఉపేంద్ర, నాగిరెడ్డి, సుబ్బరామిరెడ్డి, యువనేత సాయినరసింహారెడ్డి, ఏటూరు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు: కోట్లూరు గ్రామ పంచాయతీలో దాదాపు 130 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ కండువా కప్పుకున్నారు. ఇందులో ఎస్సీకాలనీకి చెందిన 80 కుటుంబాలతో పాటు దేవాంగులు 20 కుటుంబాలు, యాదవులు 20 కుటుంబాలు, రెడ్డి సామాజికవర్గానికి చెం దిన వారు 10 కుటుంబాలు పార్టీలో చేరినట్లు తెలిపారు.

చంద్రబాబుతోనే సమగ్రాభివృద్ధి సాధ్యం: టీడీపీ


కార్యక్రమంలో పాల్గొన్న కడప ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 23: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి, జనసేన ఇన్‌చార్జ్ సుంకర శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం 33వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ పథకంలో భాగంగా కరపత్రాలు అం దించారు.

మహాస్వప్నికుడు పుస్తకం ఆవిష్కరణ

స్థానిక మహారాజ ఫంక్షన్ హాలులో శుక్రవారం మహా స్వప్నికుడు పుస్తకాన్ని ఆవిష్కరించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, మాధవి హాజరయ్యారు.

టీడీపీని గెలిపించండి.. అభివృద్ధి చేస్తా: బీటెక్ రవి


ఓటర్లతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

వేంపల్లె, ఫిబ్రవరి 23: ఈసారి ఎన్నికల్లో టీడీపీని గెలిపించేందుకు ప్రజలు ముందుకు రావాలని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వేంపల్లెలోని గాంధీరోడ్డు, పప్పులబజార్, అమ్మవారిశాలవీధి, మెయిన్‌బజార్ తదితర ప్రాంతాలలో శుక్రవారం సాయంత్రం బాబు ష్యూరిటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను బీటెక్ రవి ఆయన సతీమణి లతారెడ్డి ప్రజలకు అందించారు. వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని ఈ సందర్భంగా వారుపిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునిరెడ్డి, షబ్బీర్, దర్బార్, రామగంగిరెడ్డి, ఆర్వీరమేష్, తెలంగాణ వలి, మహమ్మద్, మడక శ్రీనివాసులు, రెడ్డి కిషోర్, మహబూబ్ షరీఫ్, అల్లాబకాష్, తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గాదేవి ఆలయంలో వైభవంగా ధ్వజారోహణం


అమ్మవారికి పంచామృతాలతో అభిషేకిస్తున్న దృశ్యం

కడప (కల్చరల్), ఫిబ్రవరి 23 : జగన్మాత కడప విజయదుర్గాదేవి ఆలయంలో 22వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు శుక్రవారం మొదటి రోజున వైభవంగా ప్రారంభించారు. తెల్లవారుజామున ఆలయ నిర్వాహకుడు దుర్గాప్రసాద్ దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు, బంగారు నగలు సమర్పించారు. అనంతరం అర్చకులు వేద మంత్రాలనడుమ పంచామృతాభిషేకం నిర్వహించారు. ఉదయం 8గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారి సింహ వాహనాన్ని ఆలయ ధ్వజస్తంభంపై ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. 9.30కు యాగమండపంలో గణపతి పూజ చేసి ద్వారదేవత ఆవాహన, మండపారాధనలు, ప్రధకలశస్థాపన చేశారు.
అలాగే ఆలయ మండపంలో నవావరణ శ్రీచక్రార్చనలు నిర్వహించారు. శుక్రవారం కావడంతో ఉదయం 10.30కు సుమంగళి పూజలు చేశారు. రాత్రి 8గంటలకు విజయదుర్గాదేవి మల్లిఖార్జునస్వామితో కలిసి సింహవాహనంపై ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.


ధ్వజారోహణ కార్యక్రమంలో వేదపండితులతో ఆలయ నిర్వాహకుడు దుర్గాప్రసాద్

ఎంబీబీఎస్‌లో రైతుబిడ్డకు గోల్డ్‌మెడల్


కుటుంబ సభ్యులు, బంధువులతో గోల్డ్‌మెడల్ అందుకున్న హేమప్రియాంక

సీకేదిన్నె, ఫిబ్రవరి 23: ఎంబీబీఎస్ ఫలితాల్లో అన్నంరాజు హేమప్రియాంక గోల్డ్‌మెడల్ సాధించడం పట్ల ఆమె కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చింతకొమ్మదిన్నె మండలం కొలుములపల్లె క్రిష్ణాపురానికి చెందిన అన్నంరాజు హరి, యశోదర దంపతుల ద్వితీయ పుత్రిక మొదటి నుంచి చదువులో ముందుండేదని, 1 నుంచి 6 వరకు స్థానిక మండల పరిషత్ పాఠశాలలో చదివి 7 నుంచి 10 వరకు బయనపల్లె వెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో చదివి 9.2 గ్రేడ్ తెచ్చుకుందన్నారు. అదే విధంగా ఇంటర్‌లో శ్రీచైతన్య కాలేజీలో 972 మార్కులు సాధించిందన్నారు. నీట్‌లో 496 మార్కులు సాధించి జాతీయస్థాయిలో 27వేల ర్యాంకు, రాష్ట్రస్థాయిలో 2050 సాధించి చిత్తూరు జిల్లా అపోలో మెడికల్ కాలేజీలో సీటు సాధించిందన్నారు. 72 శాతం మార్కులతో ఎంబీబీఎస్‌లో గోల్డ్‌మెడల్ సాధించడంతో వారి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తండ్రి వ్యవసాయం చేసుకుంటూ పిల్లలను ఉన్నత చదువులు చదివించడంతో ఆమె తల్లిదండ్రులను అందరూ అభినందించారు. తమ విద్యార్థిని బంగారు పతకం సాధించడం పట్ల వెంకటేశ్వర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దీనదయాళ్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా సురేష్‌బాబు

సీకేదిన్నె, ఫిబ్రవరి 23: ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా సురేష్‌బాబును ఎన్నుకున్నట్లు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగిన రాష్ట్రోపాధ్యాయ సంఘం ఎన్నికల్లో చింతకొమ్మదిన్నె మండలం జె.కొత్తపల్లె ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సురేష్‌బాబును అసోసియేట్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో హెచ్ఎం భాగ్యలక్ష్మి అభినందించారు.

నేడు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం

బి.కోడూరు, ఫిబ్రవరి 23 : మండల పరిధిలోని బద్వేలు, పోరుమామిళ్ల మెయిన్‌రోడ్డు దంతెల పల్లె గ్రామంలో వెలసిన రమాసహిత సత్యనారాయణస్వామి దేవస్థానంలో పౌర్ణమి శనివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. వ్రతంలో పాల్గొనేవారు పూజా సామగ్రి తెచ్చుకోవాలని తెలిపారు. భక్తులకు సిద్ధమూర్తి సుబ్బారెడ్డి (సొద్దలు) అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అదే రోజు రాత్రికి సీతారామాంజనేయ బృందంచే కోలాటం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

బద్వేలు, ఫిబ్రవరి 23: లక్ష్య సాధన ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గడప గడపకు గోవు, గోవిందు గీత కార్యక్రమం 34వ రోజు పట్టణంలోని వాసవి అపార్ట్‌మెంటులో గట్టు అరుంధతి రంగాచార్యులు,శ్రీవారి తిరుమల మహాపాదయాత్ర నాగమల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం వేంకటేశ్వస్వామి కల్యాణం నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారి పాదాలకు పాదాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో పలువురు అపార్ట్‌మెంటు వాసులు పాల్గొన్నారు.

దళితుడిపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి

బద్వేలు , ఫిబ్రవరి 23: బద్వేలు నియోజకవర్గంలోని అట్లూరు మండలం మణ్యంవారి పల్లె దిన్నెమీదపల్లె దళితవాడకు చెందిన జయన్నపై దాడి చేసిన అగ్ర కులస్థులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆల్ తెలుగు ప్రజా పార్టీ రాష్ట్ర పరిశీలకుడు ముండ్లపాటి పిచ్చయ్య, దళిత హక్కు పోరాట సమితి జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి వెంకటరమణ డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతిరోజూ ఎక్కడో ఒక చోట దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని, వాటిని నివారించడంలో ప్రభుత్వం విఫలమవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు ఓ.ఎస్‌వి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి



రికార్డులు పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారి

గోపవరం, ఫిబ్రవరి 23 : ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ అధికారి రమేష్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మడకలవారిపల్లె సచివాలయంలో ఆరోగ్యశాఖకు సంబంధించిన రికార్డులను శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం అనీమియా, గర్భిణులు, బాలింతలు, 10 నుంచి 18 సంవత్సరాల బాలికలకు సంబంధించిన రక్తపరీక్షల రిపోర్టులను పరిశీలించారు. అదే విధంగా ఆరోగ్యం పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శరత్‌చంద్ర, డీసీహెచ్‌ఎన్ ఓ.భారతి, ఏఎస్‌వో యాకుబ్, నారాయణ, సీహెచ్‌వో గౌస్, హెల్త్ సూపర్‌వైజరు శివరామిరెడ్డి, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శిగా రంతుల్లా

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 23 : పోరుమామిళ్లకు చెందిన రంతుల్లా టీడీపీ జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు భైరవ ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పోరుమామిళ్ల మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్, టీడీపీ నాయకులు సీతా వెంకటసుబ్బయ్య, కల్వకూరి వెంకటసుబ్బయ్య, రామసుబ్బారావు, పట్టణ అధ్యక్షులు మస్తాన్ , ఎంపీటీసీ కల్వకూరి రమణ, సంచర్ల మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, మాజీ ఎంపీటీసీ షరీఫ్, సత్యరాజ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'టీడీపీలో సైనికుడిలా పనిచేస్తా'

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 23 : తెలుగుదేశం పార్టీలో సైనికుడిలా పని చేస్తానని టీడీపీ నాయకుడు రంగసముద్రం ఎంపీటీసీ కల్వకూరి రమణ అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను మరలా తిరిగి వైసీపీకి వెళుతున్నాననేది వాస్తవం కాదన్నారు. తానంటే గిట్టనివారు కొందరు తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాపయ్య, శివశంకర్ పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించిన సర్పంచ్

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 23 : మండలంలోని అక్కల్‌రెడ్డిపల్లె హరిజనవాడలో తాగునీటి సమస్య తలెత్తడంతో సర్పంచ్ గోపాలమ్మ సొంత నిధులతో కొత్తగా బోరు ఏర్పాటు చేయడంతో కాలనీవాసుల తాగునీటి సమస్య పరిష్కారమైంది. అక్కల్‌రెడ్డిపల్లె గ్రామంలోని హరిజనవాడలో తాగునీటి సమస్య తలెత్తడంతో అక్కడ వారు సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె శుక్రవారం కొత్త మోటారు ఏర్పాటు చేశారు.

అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్



ప్రొద్దుటూరులో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు సీఎం. సురేశ్‌నాయుడు, లింగారెడ్డి, వరదరాజులరెడ్డి, కొండారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి తదితరులు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 23: అబద్ధపు హామీలతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చారని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం జమ్మలమడుగు పట్టణంలోని నాగులకట్టవీధి 5వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.సంజాముల మోటులో టీడీపీ జెండా ఆవిష్కరణ చేసి సూపర్ 6 పథకాలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, దేవగుడి యూత్ బాల పుల్లారెడ్డి బ్రదర్స్ జగదీష్, జనసేన నాయకులు నాగార్జున, ఎంఎం బాష, సంతోష్, కేకే ఖదీర్, జయచంద్ర, మంత్రి శ్రీను, మునిరెడ్డి, గురుకుమార్, లక్ష్మీనాయుడు, అనంతనాయుడు, నాగరాజు, బెల్లాల శ్రీను, వెంకటకృష్ణయ్య, వెంకటరమణ, మహేష్‌రాయల్, నవీన్, ఐఎల్ చిన్న, హర్షద్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..ఆంధ్ర ప్రదేశ్‌కు రాజధానేదని అడిగితే ఏదని చెప్పలేని దౌర్భాగ్య స్థితిని జగన్ పాలన కల్పించిందని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజురెడ్డి విమర్శించారు. శుక్రవారం స్థానిక కొత్తపల్లె పంచాయతీ లోని ప్రకాష్‌నగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బాబు ఆరుగ్యారెంటీ లకరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, కడప పార్లమెంటు కార్యదర్శి నాగమునిరెడ్డి, బచ్చలవీరప్రతాప్, సమ్మద్ ఖాసీం, వివేకానందకాలనీ గంగాధర్, శివ, షరీఫ్, పక్కీరయ్య, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: గత టీడీపీ ప్రభుత్వం ముస్లింలకు అందించే అన్ని పథకాలు వైసీపీ ప్రభుత్వం రద్దుచేసిందని టీడీపీ సీనియర్ నాయకుడు సీఎం సురేష్ నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగారెడ్డి విమర్శించారు. శుక్రవారం శ్రీనివాస నగర్‌లో ఎన్నికల ప్రచార కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు, కేలండర్లు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్ ముక్తియార్,మాజీ ఎంపీపీశెట్టి పల్లె ప్రభాకర్‌రెడ్డి,టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి ,నల్లబోతులనాగరాజు, ఖలీల్, చెన్నూరు నిజాం అహ్మద్, చెన్నయ్య విజయ్‌బాస్కర్, చలమయ్య జనసేన ప్రతినిధి జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: టీడీపీ ప్రభుత్వం రాగానే జగన్ జైలు ఊచలు లెక్కపెట్టక తప్పదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పెన్నానగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భవిష్యత్‌గ్యారెంటీ పథకాలను గురించి ప్రచారం చేశారు.మౌనికారెడ్డి, హరితారెడ్డి,జబీవుల్లా, కమలాపురం మజీద్, షైనుద్దీన్, ముజాయిద్దీన్, రామచంద్రారెడ్డి బాబుల్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, తాటి శ్రీను, అవుల దస్తగిరి పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధిపథంలో పరుగులు పెడుతుందని బొజ్జ అరుణ, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవి, పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ హబీబున్నీసా అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 9, 10 వార్డుల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచి సంక్షేమ పథకాలు వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీ సుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య, వేణుగోపాల్‌రెడ్డి, మస్తాన్‌బాబు, వెంకటసుబ్బారెడ్డి, శేఖర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, జయరామయ్య, రామసుబ్బారెడ్డి, పసుపులేటి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: టీడీపీ ప్రభుత్వ హయాం నాయీ బ్రాహ్మణులు అభివృద్ధి చెందారని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొలవలి వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం నాయీ బ్రాహ్మణుల దుకాణాల వద్ద కరపత్రాలను పంపిణీ చేశారు.టీడీపీ నాయీబ్రాహ్మణ సాధికారిక సమితి జిల్లా కన్వీనరు గజ్జల గోవిందు, జిల్లా కమిటీ సభ్యుడు కొమెర్ల రామక్రిష్ణ, కలసపాడు సుబ్బనారాయణ, బద్వేలు శ్రీనివాసులు, గురుబ్రహ్మం, బాబు, వెంకటసుబ్బయ్య అలంగీర్ పాల్గొన్నారు.

మైలవరం..: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి తల్లి దేవగుడి సరస్వతి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పొన్నంపల్లి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో నిర్వహించారు.ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని టీడీపీ మేనిఫెస్టోను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాపిరెడ్డి, కొండయ్య, సూర్యపెద్దిరాజు, మారెన్న, ఆంజనేయులు, దస్తగిరి, నాగేష్, మునిరెడ్డి, గురువయ్య, మహేష్, రాజ, మహదేవుడు, బాల గంగరాజు, స్వామిదాసు, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.



జమ్మలమడుగులో ప్రచారం చేస్తున్న భూపేశ్‌రెడ్డి



బద్వేలులో కరపత్రాలు అందిస్తున్న కొలవలి వేణుగోపాల్

ఓటు హక్కుపై అవగాహన సదస్సు



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, అధ్యాపకులు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 23: ఓటు హక్కు మీ జన్మ హక్కు అని రెవెన్యూ అధికారులు ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శుక్రవారం జమ్మలమడుగు పట్టణంలోని షిరిడీసాయి డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఓటు హక్కు, ఓటు నమోదు గురించి అవగాహన కల్పించారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ నెహ్రూ యువకేంద్ర ఆదేశాల మేరకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వారు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు వేణుగోపాల్‌కు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీదేవి, జూటూరు విజయ్‌కుమార్, ఏఎస్‌ఐ మురళీయాదవ్, అధ్యాపకులు వెంకటస్వామి, నరసింహప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ గాడ్గేబాబా జయంతి వేడుకలు



బద్వేలులో మాట్లాడుతున్న గురుమూర్తి

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 23 : సంత్ గాడ్గేబాబా జయంతి వేడుకలు స్థానిక వివేకానంద భవన్‌లో జరిగాయి. ఆ లిండియా మహాసంఘ్ ఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్రిష్ణయ్య ఆధ్వర్యంలో శుక్రవారం బాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలసపాడు, కాశినాయన, బీకోడూరు మండలాల రజకులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ సంఘ నేతలు గురుమూర్తి, గురప్పడు, వెంకటేశ్వర్లు, మధు, వినయ్ పాల్గొన్నారు.

బద్వేలు..: స్వచ్ఛభారత్ ఆద్యుడు సంఘ సంస్కర్త సంత్ గాడ్గే బాబా అని పూలే ఆశయ సాధన సమితి చైర్మన్ గురుమూర్తి పేర్కొన్నారు. పూలే ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో గాడ్గే బాబా జయంతి నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బయ్య, జిల్లావర్కింగ్ అధ్యక్షుడు రమణయాదవ్, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఆవాజ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తార్, అన్వర్‌బాష, రజకసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కర్షకులకు కరెంటు కష్టాలు..!

- ఆచరణకు నోచుకోని 9 గంటల విద్యుత్ సరఫరా
- సాగునీరు అందక ఎండుతున్న పంటలు
- అవస్థల్లో అన్నదాతలు



గోపవరంలో ఎండుతున్న నువ్వులపంట


బద్వేలు, ఫిబ్రవరి23: వ్యవసాయం రైతన్నలకు జూదంగా మారడంతో రైతుల అవస్థలు వర్ణనాతీతం. వేలకు వేలు పెట్టుబడులు పెట్టి పంటలు సాగుచేసి చేతికందే సమయంలో తెగుళ్ల బారిన పడడం, సక్రమంగా నీరు అందక ఎండిపోతుండడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. గత కొన్ని రోజుల నుంచి నియోజకవర్గంలో ఎడాపెడా విద్యుత్ కోతలు విధిస్తుండ డంతో విద్యుత్ కోతలతో సక్రమంగా సాగునీరు అందక సాగు చేసిన పంటలు ఎండిపోతుండడంతో అన్నదాతలు గగ్గోలు పెడుతున్నారు. అధికారంలోకి వస్తే వ్యవసాయానికి 9 గంటలు ఉచిత విద్యుత్ ఇచ్చి రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లాలోనే విద్యుత్ కోతలతో రైతులు విలవిల లాడుతున్నారు.కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో రైతులకు సమాచారం లేకపోవడంతో మోటార్ల వద్దనే కాపలా కాయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. 9 నుంచి 7 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నప్పటికీ అందులోనూ కోతలు అధికంగా ఉండడంతో సకాలంలో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. బద్వేలు మైదుకూరు నియోజకవర్గంలో దాదాపు వేల ఎకరాలలో వరి, పత్తి, నువ్వులు సాగుచేశారు.ఎకరాకు రూ.40 వేల వరకు పెట్టుబడులు పెట్టి పంటలను సాగుచేశారు. జగనన్న ఇచ్చిన హామీని రైతులు నమ్ముకుని 9 గంటలు విద్యుత్ సరఫరా అవుతుందని గంపెడాశతో పంటలు సాగుచేశారు. కానీ సకాలంలో సాగునీరు అందకపోవడంతో పంటలు తమ కళ్లెదుటే ఎండిపోతున్నా ఏమీ చేయలేని స్థితిలో ఉన్నామని రైతులు వాపోతున్నారు. బద్వేలు విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో 10,700 వ్యవసాయ విద్యుత్ కనెక్షను ఉన్నాయి. వీటిని నమ్ముకుని రైతులు వ్యవసాయ బోర్ల కింద పంటలు సాగుచేశారు. కొన్ని రోజుల నుంచి విద్యుత్ కోతలు విధి స్తుండడంతో సకాలంలో సాగునీరు అందక పంటలు నిలువుగా ఎండి పోతున్నాయి. సీఎం చెప్పిన హామీ ప్రకారం 9 గంటలు విద్యుత్ సరఫరా చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు. ఈ విద్యుత్ కోతల విషయంపై ట్రాన్స్‌కో ఏడీ కుళాయప్ప స్పందిస్తూ వ్యవసాయానికి అందించే విద్యుత్ సరఫరాలో వీలైనంత వరకు ఎలాంటి అంతరాయం కలుగకుండా చర్యలు చేపడుతున్నామని ఆయన తెలిపారు.

రైతులపై కాల్పులు దారుణం

బద్వేలు, ఫిబ్రవరి 23: ఢిల్లీలో ఉద్యమం చేస్తున్న రైతులపై కేంద్ర పభుత్వం వ్యవహరించిన తీరు బీజేపీ నిరంకుశత్వానికి తార్కాణంగా నిలుస్తోందని సీపీఎం పట్టణ నాయకుడు ముడియం చిన్ని పేర్కొన్నారు.రైతులపై దాడిని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పూలే విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు మోక్షమ్మ, బాలమ్మ, నాగమ్మ, మస్తాన్ బీ తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: ఢిల్లీలో పోలీసు కాల్పుల్లో తూటాలకు బలైన యువ రైతుకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి భైరవ ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం పోరుమామిళ్లలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో రైతాంగం పోరాటానికి మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిమాండ్లను అమలు చేయాలని కోరడానికి హర్యానా, పంజాబ్ నుంచి ఢిల్లీకి రైతులు రాబోతుంటే బాష్పవాయువు ప్రయోగించడం, తుపాకులతో భయభ్రాంతులకు గురి చేయడం జరిగిందన్నారు. ఈ కాల్పుల్లో యువ రైతుకు బుల్లెట్ తగిలి మరణించాడన్నారు. ఈ కార్యక్రమంలో సీపీయం నాయకులు రవి, బీబీ, రామక్రిష్ణ, చెన్నయ్య పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు టౌన్..: ఢిల్లీలో పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని నిరసన చేపట్టిన రైతులపై పోలీసులు కాల్పులు జరపడం అమానుషమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ విమర్శించారు. రైతు మృతి పట్ల శుక్రవారం స్థానిక రాజీవ్ సర్కిల్‌లో సీఐటీయూ నాయకులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సాల్మన్, చంటి, రవి, శేఖర్, చెన్నారెడ్డి, సర్వేశ్వరి, రాములమ్మ, వెంకటేష్, హరి, శీను పాల్గొన్నారు.



బద్వేలులో పూలే విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

నేడు మండల సర్వసభ్య సమావేశం

బి.కోడూరు, ఫిబ్రవరి 23 : బి.కోడూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కోడూరు చెన్నమ్మ అధ్యక్షతన శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భాస్కర్‌రావు తెలిపారు. సమావేశానికి అన్నిశాఖల అధికారులు తమ తమ నివేదికలతో హాజరుకావాలని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 23 : స్థానిక సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పోరుమామిళ్ల, బికోడూరు , కాశినాయన మండల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి 10 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటమహేష్ తెలిపారు. 132/33కేవీ సబ్ స్టేషన్‌లో శనివారం మరమ్మతులు నిమిత్తం నిలిపివేయడం జరుగుతుందన్నారు. గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు గమనించాలని అన్నారు.

3న ఉచిత వైద్యశిబిరం

జమ్మలమడుగు, ఫిబ్రవరి 23: జమ్మలమడుగు పట్టణంలో డాక్టర్ మునిరెడ్డి కాంప్లెక్స్‌లో మార్చి 3వ తేదీ ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు లక్షుమయ్య తెలిపారు. ఎముకలు, కీళ్ల వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు హైదరాబాదు మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యనిపుణుడు డాక్టర్ ప్రదీప్‌రెడ్డి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. వైద్యశిబిరాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

పేకాట స్థావరంపై దాడి

కొండాపురం, ఫిబ్రవరి 23: మండలంలోని గండ్లూరు గ్రామం వద్ద శుక్రవారం పేకాట స్థావరంపై స్పెషల్ పార్టీ పోలీసులు దాడులు నిర్వహించారు.పొలాల్లో పేకాట ఆడుతున్న 25 మంది నుంచి రూ.1,40,000 స్వాధీనపరుచుకున్నారు. వీరిని కోర్టుకు హాజరు పరచనున్నట్లు కొండాపురం ఎస్‌ఐ యోగీంద్ర తెలిపారు.

దూదేకుల సంఘం అధ్యక్షుడుగా మునెయ్య



మైదుకూరు రూరల్ ఫిబ్రవరి 23 : మైదుకూరు నియోజకవర్గ దూదేకుల సంఘం అధ్యక్షుడుగా ప్రొద్దుటూరు మునెయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం మాబు హుస్సేన్ మినీ ఫంక్షన్ హాల్‌లో దూదేకుల సంఘం సమావేశం జరిగింది.ఈ సమావేశంలో నియోజకవర్గంలో పలువురు దుదేకుల సంఘం వారు హాజరయ్యారు. గౌరవాధ్యక్షులుగా నాయబ్‌రసూల్, మునెయ్య, దస్తగిరి, సిద్దయ్య, ఖలందర్ బాషా, బాష ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా నాయబ్ రసూల్, దస్తగిరి, అబ్దుల్, గోపి, పవన్‌కుమార్, తొండలదిన్నె బాషా, రవీంద్ర, పి.దస్తగిరి, నూరి, జి దస్తగిరి తదితరులు ఎన్నికయ్యారు.

మహాలక్ష్మీదేవి అలంకారంలో పెద్దమ్మతల్లి

మైదుకూరు రూరల్, ఫిబ్రవరి 23 : పాతూరులో పెద్దమ్మతల్లి వార్షికోతవ వేడుకలు అంగరంగ వైభవంగా జరుతున్నాయి.శుక్రవారం మహాలక్ష్మీదేవి అలంకారంలో పెద్దమ్మతల్లి దేదీప్యమానంగా వెలిగిపోయారు.మహాలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారిని నోట్ల కట్టలతో అలకంరించారు. సాయంత్రం అమ్మవారి వద్ద గౌరీపూజ కార్యక్రమానికి మహిళలు హాజరయ్యారు.

చైర్మన్ వార్డులో తాగునీటి సమస్య

మైదుకూరు రూరల్ ఫిబ్రవరి 23 : మైదుకూరు మున్సిపల్ చైర్మెన్ వార్డులోనే తాగునీటి సమస్య ఉంటే మిగతా వార్డుల పరిస్థితి ఏంటని మహిళలు రోడ్డుపై బైఠాయించి అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని తొమ్మిదవ వార్డులో తాగునీటి సమస్య విపరీతంగా ఉందని ఆ వార్డు ప్రజలు కడప రోడ్డుపై బైఠాయించి కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడంతో ఎస్‌ఐ రాజేశ్వర్‌రెడ్డి అక్కడకు చేరుకొని మహిళలకు సర్దిచెప్పారు. వారు వినకపోవడంతో మున్సిపాలిటీ అధికారులను అక్కడికి పిలించారు. ట్యాంకర్ల ద్వారా నీటిని వార్డులకు తరలిస్తామని తెలపడంతో మహిళలు అక్కడ నుంచి వెళ్లిపోయారు.

బీజేపీ ఆధ్వర్యంలో ప్రజా పోరు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 23 : భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కొరపాటిపల్లె, ముసలెరెడ్డిపల్లె, కవలకుంట్ల పంచాయతీల్లో బీజేపీ ప్రజా పోరు కార్యక్రమాన్ని ఆ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి ఉట్టి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ పంచాయతీల్లో రాష్ట్ర ప్రభుత్వ అసమర్థ తీరును ఎండగడుతూ వైఫల్యాలు ఎత్తిచూపుతూ కరపత్రాలు ఇంటింటికీ ప్రచారం చేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి పీరయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.